క్లుప్తంగా

ఆకుపాముల క్లస్టర్ ఏఈఓగా మహితారెడ్డి

మునగాల : మండలంలోని ఆకుపాముల క్లస్టర్ వ్యవసాయ విస్తరణాధికారి (ఏఈఓ)గా ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన ఏ.మహితారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈమె తుంగతుర్తి నియోజకవర్గం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చినట్లు ఏడీ బుంగా రాజు తెలిపారు. ఆకుపాముల క్లస్టర్ ఏఈఓ సెలవులో ఉండడంతో ఆమె స్థానంలో మహితారెడ్డిని నియమించినట్లు తెలిపారు. కాగా, ఆకుపాముల క్లస్టర్ రైతువేదిక పరిధిలోని ఆకుపాముల, నరసింహాపురం, కోదండరామాపురం, ముకుందాపురం, బరాఖత్‌గూడెం, కృష్ణానగర్ గ్రామాలకు చెందిన రైతులు ఆకుపాముల ఏఈఓ సెల్ నంబర్ 78159 61391 ను సంప్రదించవచ్చని తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయానికి ప్రింటర్ బహూకరణ


ప్రింటర్ అందజేస్తున్న దాతలు

మునగాల : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి స్థానికులు దేవినేని సీతరామయ్య–మాధవి దంపతుల కుమారుడు దేవినేని నలంద శ్రీనివాస్ గురువారం రూ.22 వేల విలువ గల కంప్యూటర్ ప్రింటర్‌ను బహూకరించారు. సీతరామయ్య చిన్న కుమారుడు దేవినేని తరుణ్ –నళిని దంపతుల చేతుల మీదుగా ప్రింటర్‌ను తహసీల్దార్ సరితకు అందజేశారు. ఎయిర్‌ఫోర్స్ రిటైర్డ్ అధికారి నలంద శ్రీనివాస్ గురువారం జాతీయ ఎయిర్‌ఫోర్స్ డే సందర్భంగా ప్రింటర్ అందజేసినట్లు దాత కుటుంబసభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా దాతలు తరుణ్ –నళిని దంపతులను కార్యాలయ సిబ్బంది సత్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, ఆర్‌ఐ ఎస్.రామారావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ గెలుపు కోసం కృషి చేయాలి

హుజూర్‌నగర్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపు కోసం కృషి చేయాలని పార్టీ నాయకులు అన్నారు. గురువారం హుజూర్‌నగర్‌లో మండల బీజేపీ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ గెలుపు అభివృద్ధికి మలుపు అని అన్నారు. కార్యక్రమంలో నాయకులు రామరాజు, సోమయ్య, నారపరెడ్డి, కోటిరెడ్డి, లక్ష్మణ్, సాయి, అనిల్ రెడ్డి, అంజిరెడ్డి, సైదులు, నరసింహారావు, రంగయ్య, శౌరీ గౌడ్, వీరబాబు, జగన్, శ్రీకాంత్, కనకయ్య, వెంకన్న, వేముల నరేష్, సాయి, ప్రభాకర్, గోపి, నరసింహారావు, శంకర్, నవీన్, శ్రీనివాస్, వెంకీ తదితరులు పాల్గొన్నారు.

ఇండ్ల శ్రీనివాస్ ఆశయాలు సాధించాలి


శ్రీనివాస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

గరిడేపల్లి : సీపీఎం నాయకుడు ఇండ్ల శ్రీనివాస్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సీపీఎం సీనియర్ నాయకుడు తుమ్మల సైదయ్య అన్నారు. గురువారం మండలంలోని కీతవారిగూడెం గ్రామంలో గల సీపీఎం పార్టీ కార్యాలయంలో శ్రీనివాస్ 5వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సుందరి వీరరాఘవయ్య, శ్రీనివాస్, మట్టయ్య, వెంకయ్య, నారాయణ, నాగరాజు, శేఖర్, జంగయ్య, సూరయ్య, వీరస్వామి, లక్ష్మయ్య, వెంకన్న, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలను మోసం చేసేందుకే 42 శాతం రిజర్వేషన్ల డ్రామా

మునగాల : బీసీలను మోసం చేసేందుకే 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం డ్రామా ఆడిందని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఉడుం కృష్ణ ఆరోపించారు. గురువారం మునగాలలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 22 నెలలైనా ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలు అమలు చేయకుండా ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ కాలం వెళ్లదీస్తున్నారని ఆరోపించారు. దేశంలో న్యాయనిపుణులు, సీనియర్ రాజకీయ వేత్తలు నెత్తినోరు కొట్టుకొని 42శాతం రిజర్వేషన్లు సాధ్యపడదని చట్టపరంగా ఇస్తేనే సాధ్యపడుతుందని మొరపెట్టుకున్నప్పటికీ వినకుండా ఎన్నికల కమిషన్ ద్వారా నోటిఫికేషన్ విడుదల చేయించి బీసీ వర్గాలను నిలువునా మోసం చేశారని అన్నారు.

రాజ్యాంగంపై దాడిగా చూడాలి

హుజూర్‌నగర్ : సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడి దేశ రాజ్యాంగంపై జరిగిన దాడిగా చూడాలని టీఎస్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీతల రోశపతి అన్నారు. గురువారం స్థానికంగా ఆయన మాట్లాడారు. న్యాయమూర్తిపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు నరసింహారావు, వెంకన్న, రాజేష్, నాగరాజు, రాము తదితరులు పాల్గొన్నారు.

భవనాల నిర్మాణం ముమ్మరం


ఫుట్టింగ్స్ దశలో పోలీస్ స్టేషన్ కార్యాలయ భవన నిర్మాణం


ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల నిర్మాణానికి మార్కింగ్ చేసిన అధికారులు

- ప్రభుత్వ భవనాల నిర్మాణానికి రూ.7.97 కోట్లు మంజూరు
- ఫుట్టింగ్స్ లెవల్‌లో పోలీస్‌స్టేషన్
- ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాలకు మార్కింగ్ పూర్తి

అనంతగిరి : మండల కేంద్రంలో చేపట్టిన ప్రభుత్వ నూతన భవనాల నిర్మాణ పనులను అధికారులు ముమ్మరం చేశారు. మండల కేంద్రంలోని సర్వే నంబర్ 860లో రెండు ఎకరాల్లో పోలీస్ స్టేషన్, సర్వే నంబర్1460లో ఎకరం స్థలంలో తహసీల్దార్ కార్యాలయం, సర్వే నంబర్ 1460లో మండల పరిషత్ కార్యాలయం నిర్మిస్తున్నారు. ప్రస్తుతం పోలీస్ స్టేషన్ నిర్మాణ పనులు ఫుట్టింగ్స్ లెవల్‌కు చేరుకోగా, తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల భవన నిర్మాణాలు మార్కింగ్ లెవల్‌లో ఉన్నాయి.

అద్దెభవనాల్లో ఇబ్బందులు..

2016లో నూతన మండలం ఏర్పడినప్పటి నుంచి అద్దె భవనాల్లోనే ప్రభుత్వ కార్యాలయాలను నిర్వహిస్తున్నారు. అద్దె భవనాల్లో అరకొర వసతులతో అధికారులు, సిబ్బంది ప్రజలకు సేవలు అందించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి గత అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో మండల ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు పోలీస్ స్టేషన్ భవనానికి రూ.2.38 కోట్లు, తహసీల్దార్ కార్యాలయానికి రూ.2.61 కోట్లు, రెండు అంతస్తుల ఎంపీడీఓ కార్యాలయం నిర్మాణానికి రూ.2.98 కోట్ల నిధులను ప్రభుత్వం నుంచి మంజూరు చేయించారు. భవనాలను నాణ్యతా ప్రమాణాలతో వేగవంతంగా నిర్మించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు అందుబాటులోకి వస్తే అద్దెభవనాల్లో ప్రజలు పడుతున్న అవస్థలు తొలగనున్నాయి.

ఇబ్బందులు తొలగుతాయి

ప్రభుత్వ కార్యాలయాల నూతన భవనాలు పూర్తయితే మండల ప్రజలకు ఇబ్బందులు తొలగుతాయి. ప్రస్తుతం అద్దెగదుల్లో అధికారులకు సరిపడా గదులు లేకపోవడంతో అరకొర వసతులతో అధికార యంత్రాంగం సేవలు అందించాలంటే ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుంది. పూర్తిస్థాయిలో భవనాలు అందుబాటులో ఉంటే విధులు సక్రంగా నిర్వహించవచ్చు.

– తహసీల్దార్ కే. హిమబిందు

నిర్మాణాలను పర్యవేక్షిస్తున్నాం

ప్రభుత్వ కార్యాలయాల నూతన భవనాల నిర్మాణాలు సుమారు ఆరు నుంచి ఎనిమిది నెలల్లో పూర్తి చేస్తాం. భవనాల నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. ప్రస్తుతం భవన నిర్మాణాలు ఫుట్టింగ్స్, మార్కింగ్ దశల్లో ఉన్నాయి.

– దుష్యంత్, ఏఈ, ఆర్‌అండ్‌బీ

సమాచార హక్కు చట్టంతో పాలనలో పారదర్శకత


కోదాడ : మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రవణారెడ్డి

కోదాడ : ప్రజాస్వామ్య పాలనలో పారదర్శకతను తీసుకురావడానికి సమాచార హక్కు చట్టం ఎంతో దోహదపడుతుందని కేఆర్‌ఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రవణారెడ్డి అన్నారు. గురువారం కోదాడలోని కేఆర్‌ఆర్ జూనియర్ కళాశాలలో సమాచార హక్కు చట్టం–2005 పై జరిగిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. కోదాడ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఉయ్యాల నర్సయ్య మాట్లాడుతూ.. విద్యార్థులు సమాచార హక్కు చట్టంపై అవగాహన పెంచుకోవాలని కోరారు. పన్నుల రూపంలో ప్రజలు చెల్లించే డబ్బును ప్రభుత్వాలు ఎలా ఖర్చు చేస్తున్నాయో సమాచార హక్కు చట్టం ద్వారా తెలుసుకోవచ్చన్నారు. ఈ చట్టంతో ప్రభుత్వ అధికారుల్లో జవాబుదారితనం వస్తుందన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి వేముల వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సెమినార్‌లో శాంతయ్య, పిచ్చిరెడ్డి, యాదగిరి, బలభీమరావు, రమేష్, రమేస్‌బాబు,, రామరాజు, తిరుమల, విద్యార్థులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

నడిగూడెం : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం సమాచార హక్కు వికాస సమితి ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కార్యదర్శి నోముల బుచ్చయ్య మాట్లాడుతూ.. సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు. అదేవిధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి.విజయ నాయక్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చే గువేరా జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి


చే గువేరా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

నేరేడుచర్ల : ప్రజా పోరాటాలే శ్వాసగా జీవించిన విప్లవవీరుడు చే గువేరా జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని ఏఐవైఎఫ్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను అన్నారు. గురువారం నేరేడుచర్లలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో చే గువేరా వర్ధంతి నిర్వహించారు. ఆ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు అమరారపు పున్నయ్య, బీసీ హక్కుల సాధన సమితి జిల్లా సహాయ కార్యదర్శి కోమరాజు వెంకట్, ఎస్‌కె మధార్, దళిత హక్కుల పోరాట సమితి పట్టణ అధ్యక్షుడు నవీన్, పులి సాహెబ్, జి. శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఏడేళ్లైనా అసంపూర్తిగానే శివాలయం


అసంపూర్తిగా ఉన్న శివాలయం

నడిగూడెం : మండల కేంద్రంలో కాగితరామచంద్రాపురం రహదారి వెంట ఉన్న స్థలంలో ఏడు సంవత్సరాల కిందట చేపట్టిన శివాలయం నిర్మాణ పనులు నత్తనడకన జరుగుతున్నాయి. మండల కేంద్రం సమీపాన ఉన్న శ్రీ సారంగేశ్వరస్వామి చెరువు వెంట ఉన్న కాకతీయుల కాలంలో నిర్మించిన పాత కాలం నాటి శివాలయం కాలక్రమేణా పూర్తిగా శిథిలావస్థకు చేరింది. దీంతో నూతన ఆలయాన్ని నిర్మించేందుకు ప్రభుత్వం రూ.50 లక్షలు మంజూరు చేసింది. ఆ నిధులతో ఏడు సంవత్సరాల కిందట పనులు చేపట్టారు. నాటి నుంచి పనులు నత్తనడకన జరుగుతున్నాయి. సంబంధిత కాంట్రాక్టర్‌కు బిల్లులు విడుదల కాకపోవడంతోనే పనులు గత ఏడాదిన్నర కాలంగా నిలిచినట్లు స్థానికులు చెబుతున్నారు. దేవాదాయ శాఖ అధికారులు స్పందించి పనులు పూర్తిచేయాలని భక్తులు కోరుతున్నారు.

శిలాఫలకాలు నిర్మించారు.. వివరాలు మరిచారు


రావిపహాడ్‌లో వివరాలు రాయని శిలాఫలకం

మోతె : మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ నిధులత సీసీ రోడ్ల శిలాఫలకాలు నిర్మించారు కానీ వాటిపై రోడ్డు నిర్మాణానికి ఖర్చు, తదితర వివరాలు రాయడం మరిచారు. పలు గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి ఖర్చైన నిధుల వివరాలు తెలియపరిచే శిలాఫలకాలు ఏర్పాటు చేయకపోవడంతో ఏ నిధుల నుంచి ఎంత ఖర్చుతో రోడ్ల నిర్మాణం చేపట్టారోనని ప్రజలు చర్చించుకుంటున్నారు. కాంట్రాక్టర్లు తక్షణమే శిలాఫలకాలు ఏర్పాటు చేసి పనులకు ఖర్చు చేసిన నిధుల వివరాలు తెలియజేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు ధ్వంసం.. ప్రమాదాలకు నిలయం

మోతె : మండలంలో రావిపహాడ్–కాచిగూడెం గ్రామాల మధ్య రావిపహాడ్ పెద్ద చెరువు వాగుపై నిర్మించిన కల్వర్టు వద్ద సీసీ రోడ్డు వరద ఉధృతికి ధ్వంసమైంది. దీంతో రావిపహాడ్, కాచిగూడెం గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కల్వర్టు వద్ద సీసీ రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


రావిపహడ్- కాచిగూడెం గ్రామాల మధ్య పెద్ద చెరువు వాగు కల్వర్టు వద్ద ధ్వంసమైన రోడ్డు

రాకపోకలు సాగించేదెలా..


రేపాల రహదారిలో నిలిచిన వర్షపునీరు

మునగాల : మండల పరిధిలోని రేపాల గ్రామం నుంచి నరసింహులగూడెం వెళ్లే రోడ్డు వాగును తలపిస్తోంది. రోడ్డుపై మురుగుతో పాటు వర్షపు నీరు నిలిచి రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు ఇలా ఉంటే రాకపోకలు ఎలా సాగించాలని ప్రశ్నిస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి రహదారిపై వర్షపు నీరు నిలవకుండా చూడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఉపాధి కూలీలు ఇ కేవైసీ చేయించుకోవాలి


ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న ఏపీడీ పవన్‌కుమార్

పెన్‌పహాడ్ : ఉపాధి హామీ కూలీలు ముఖ గుర్తింపు హాజరు కోసం జాబ్‌కార్డుకు ఆధార్ కార్డుతో ఇ కేవైసీ చేయించుకోవాలని ఏపీడీ పవన్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలో జరుగుతున్న ఈ కేవైసీ ప్రక్రియను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఈ కేవైసీ ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ కూలీలు జాబ్‌కార్డు, ఆధార్ కార్డుతో స్థానిక క్షేత్ర సహాయకుల ద్వారా ఈ కేవైసీ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ రవి, ఈసీ మహేష్, టీఏలు ఏకస్వామి, వెంకటేశ్వర్లు, రాంకుమార్, బుచ్చన్న, అనూష, ఎఫ్ఏ కవి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక


విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ జయరాజన్

మిర్యాలగూడ : ఇండోర్ స్టేడియంలో ఈనెల 6న నిర్వహించిన అండర్ –17 బాక్సింగ్ జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో మిర్యాలగూడ పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ స్కూల్ విద్యార్థి నవదీప్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ కెకె. జయరాజన్ తెలిపారు. గురువారం ప్రతిభ చాటిన నవదీప్‌ను పాఠశాలలో ఆయన అభినందించి మాట్లాడారు. నవదీప్ భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, మరెన్నో విజయాలు సాధించాలన్నారు. తమ పాఠశాలలో చదువుతోపాటు క్రీడలకు సమాన ప్రాధాన్యత ఇస్తూ పీఈటీల ఆధ్వర్యంలో తగిన శిక్షణ ఇప్పిస్తూ విద్యార్థులను ఉన్నత స్థాయి పోటీలకు పంపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ జీన్సీ జయరాజన్, హెచ్ఎం సుజయ్‌కుమార్, పీఈటీలు నీలం రమేష్, ఎం.శివశంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

మిర్యాలగూడ అర్బన్ : రంగారెడ్డి జిల్లా తుర్కయాంజల్ ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహించబోయే తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లు గౌతంరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మిర్యాలగూడలోని సీపీఎం కార్యాలయంలో రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. మహాసభలకు కార్మికులు భారీగా తరలిరావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిరుపతి రామ్మూర్తి, సిహెచ్.వెంకన్న, మోహన్, వీరయ్య, లక్ష్మీనారాయణ, బావండ్ల పాండు, పాపిరెడ్డి, బంటు రామారావు తదితరులు పాల్గొన్నారు.

దొడ్డా సురేష్‌బాబు మృతి తీరని లోటు


చిలుకూరులో దొడ్డా సురేష్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి


కోదాడ : సురేష్‌బాబు మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న జూలకంటి రంగారెడ్డి, నాగార్జునరెడ్డి

చిలుకూరు : చిలుకూరు గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ దొడ్డా సురేష్‌బాబు గుండెపోటుతో మృతి చెందడం తనను తీవ్రంగా కలచివేసిందని కోదాడ ఎమ్మెల్యే ఎన్.పద్మావతిరెడ్డి అన్నారు. గురువారం చిలుకూరులో సురేష్‌బాబు చిత్రపటం వద్ద నివాళులర్పించి మృతుడి కుటుంబసభ్యులకు తన సానుభూతి వ్యక్తం చేశారు. సురేష్‌బాబు మంచి గుణం ఉన్న వ్యక్తి అని కొనియాడారు. ఆయన మరణం తీరని లోటని అన్నారు. సురేష్‌బాబు కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కీత వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు, కుటుంబసభ్యులు ఉన్నారు.

దొడ్డా సురేష్‌బాబు మృతి బాధాకరం

కోదాడ, చిలుకూరు : గుండెపోటుతో మరణించిన చిలుకూరు మాజీ ఎంపీపీ దొడ్డా సురేష్ మృతదేహాన్ని గురువారం కోదాడలోని బాలాజీనగర్‌లో గల వైకుంఠధామంలో సీపీఎం నాయకులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డిలు సందర్శించి నివాళులర్పించారు. అనంతరం దొడ్డా సురేష్‌బాబు స్వగ్రామమైన చిలుకూరులో ఆయన కుటుంబాన్ని వారు పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా సురేష్‌బాబు చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. చిన్న వయస్సులోనే సురేష్ అకాలంగా మృతి చెందడం బాధాకరమని అన్నారు. రాజకీయంగా మంచి మిత్రుడిని కోల్పోయామని అన్నారు. వారి వెంట పార్టీ నాయకులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కోట రమేష్, మేదరమెట్ల వెంకటేశ్వరరావు, పల్లె వెంకటరెడ్డి, యాకూబ్, ముత్యాలు, రాములు, బాలునాయక్, దొడ్డా వెంకటయ్య, కోట గోపి, వేనేపల్లి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మోసకారి ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలి


సమావేశంలో బాకీ కార్డులను ప్రదర్శిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

హుజూర్‌నగర్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో మోసకారి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని బీఆర్ఎస్ నియోజకవర్గ సమన్వయకర్త ఒంటెద్దు నర్సింహారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని బూరుగడ్డలో నిర్వహించిన పార్టీ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అమలు చేయకుండా ప్రజలను నట్టేటా ముంచిందని, దానిని ప్రజలకు వివరించాలని ఆయన కార్యకర్తలకు సూచించారు. కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయని హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, ఎన్నికలు ఏవైనా బీఆర్ఎస్ పార్టీకి బ్రహ్మరథం పట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరవేయాలని ఆయన కోరారు. అనంతరం బాకీ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, నాయకులు డాక్టర్ కేఎల్ఎన్‌రెడ్డి, షేక్ సలీమా రంజాన్, అన్నెం శిరీషా కొండారెడ్డి, పత్తిపాటి రమ్య నాగరాజు, గువ్వల వీరన్న, చికూరి రాజారావు, షేక్ అలీపాషా, పల్లె నాగిరెడ్డి, మల్లెపల్లి వీరబాబు, కామిశెట్టి వెంకటేశ్వర్లు, కె.సతీష్, ఎం.పరశురాం, ఎస్.మట్టారెడ్డి, వి.లింగారెడ్డి, ఎం.నరసింహారావు, జి.శ్రీను, నాగేశ్వరరావు, నారాయణ, శ్రీను, పార్టీ గ్రామ శాఖల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

వెదజల్లే పద్ధతితో అధిక దిగుబడులు


సర్వే నిర్వహిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

పెన్‌పహాడ్ : వరి సాగులో వెదజల్లే, డ్రమ్ సీడర్ పద్ధతులతో అధిక దిగుబడులు సాధించొచ్చని కేవీకే శాస్త్రవేత్త ఎ.కిరణ్ తెలిపారు. మండల పరిధిలోని లింగాల గ్రామంలో ఐసీఏఆర్ భారతీయ వరి పరిశోధన సంస్థ రాజేంద్రనగర్ ఆధ్వర్యంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీఎస్ఆర్ ఫండ్ సహకారంతో నేరుగా విత్తే పద్ధతిలో వరి సాగు చేస్తున్న రైతుల పొలాల్లో శాస్త్రవేత్తలు గురువారం బెంచ్‌మార్క్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా చీడపీడల సమస్య, నీటి, కలుపు యాజమాన్య పద్ధతులపై రైతులను అడిగి తెలుసుకున్నారు. మోతాదులో ఎరువులు వాడాలని రైతులకు సూచించడంతో పాటు రైస్ క్లినిక్ అప్లికేషన్ వాడే విధానాన్ని రైతులకు వివరించారు. కార్యక్రమంలో క్షేత్ర సహాయకులు ఎ.సాయికిరణ్, అజయ్, రైతులు బత్తిని అంజయ్య, మామిడి రాంబాబు, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న యామ ప్రభాకర్

సూర్యాపేట : ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని జిల్లా కేంద్రానికి చెందిన వ్యాపారవేత్త యామ ప్రభాకర్ అన్నారు. ప్లాస్టిక్ నియంత్రణపై స్థానిక బాల భవన్‌లో గురువారం విద్యార్థులకు అవగాహన కల్పించి క్లాత్ సంచులను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని వదిలేసి క్లాత్‌తో తయారు చేసిన సంచులను వినియోగించడం వల్ల రాబోయే తరానికి సాయం చేసినట్లు అవుతుందని అన్నారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ప్లాస్టిక్ కాలుష్యం భయంకరమైన స్థాయిలోకి చేరుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్లాస్టిక్ సంచుల వల్ల పర్యావరణంపై కలిగే హానికరమైన ప్రభావాలపై అవగాహన పెంచి, వాటి వాడకాన్ని తగ్గించేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి దేవరాజ్, బండి రాధాకృష్ణారెడ్డి, వీరునాయుడు, అరుంధతి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఒక్కరే సిబ్బంది.. పశువైద్యానికి ఇబ్బంది

- బేతవోలు పశువైద్య ఉపకేంద్రంలో వేధిస్తున్న సిబ్బంది కొరత
- 7 గ్రామాలకు ఒక్కరే సిబ్బంది
- సబ్ సెంటర్ పరిధిలో సుమారు 15 వేల జీవాలు
- ఇబ్బందులు పడుతున్న పాడిరైతులు
- ప్రాథమిక పశువైద్య కేంద్రంగా అప్‌గ్రేడ్ చేయాలని వేడుకోలు


బేతవోలు పశు వైద్య ఉపకేంద్రం

చిలుకూరు : మండలంలో మేజర్ గ్రామ పంచాయతీ అయిన బేతవోలులోని పశు వైద్య ఉప కేంద్రంలో కేవలం ఒక్కరే సిబ్బంది ఉన్నారు. ఈ ఉప కేంద్రం పరిధిలో బేతవోలు గ్రామంతో పాటు చెన్నారిగూడెం, ఆచార్యులగూడెం, జెర్రిపోతులగూడెం, పోలేనిగూడెం, కొమ్ముబండ తండా, సీతరాం తండా గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల పరిధిలో సుమారు రైతులకు చెందిన 6 వేలకు పైగా పశువులు, 7 వేలకు పైగా సన్న జీవాలైన గొర్రెలు, మేకలు ఉంటాయి. పశువులకు, జీవాలకు అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు చికిత్స నిమిత్తం ఈ ఉప పశువైద్యశాలకు తీసుకువస్తారు. కానీ ఈ ఉప కేంద్రంలో జీవాలకు చికిత్స అందించేందుకు కేవలం ఒక్కరే సిబ్బంది ఉండడంతో పశువులకు, జీవాలను సక్రమంగా వైద్యం అందడం లేదు. ఉన్న ఒక వైద్య సిబ్బంది కూడా పశువుల చిక్సిత నిమిత్తం లేదా టీకాలు వేయడానికి గ్రామాలకు వెళ్లినా కనీసం వైద్యశాలకు వచ్చే రైతులకు జవాబు ఇచ్చేందుకు కూడా సిబ్బంది ఉండరు.

వేసవిలో వేరే ప్రాంతాల నుంచి జీవాలు..

కాగా, బేతవోలు పశువైద్య ఉప కేంద్రం చిలుకూరు పశువైద్యశాల పరిధిలోకి వస్తుంది. ఈ ఉప పశువైద్యశాలలో డాక్టర్, కనీసం ముగ్గురు నుంచి ఐదుగురు వరకు సిబ్బంది ఉండాలి. అలా అయితేనే జీవాలకు పూర్తిస్థాయిలో వైద్యం అందుతుంది. అయితే బేతవోలు గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో పశువులు, జీవాలు ఎక్కువగా ఉంటాయి. అంతేకాక ఈ గ్రామాలకు వేసవిలో వేరే ప్రాంతాల నుంచి కూడా సన్న జీవాలు వస్తాయి. కావున ఈ పశువైద్య ఉపకేంద్రాన్ని ప్రాథమిక పశువైద్యశాల స్థాయికి పెంచి డాక్టర్‌ను నియమించాలని, సిబ్బందిని పెంచాలని రైతులు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



బేతవోలు ఉప పశువైద్యశాల పరిధిలో ఒక్కరే సిబ్బంది ఉన్నారు. దీంతో ఉప పశువైద్యశాల పరిధిలో జీవాలకు సక్రమంగా వైద్యం అందని మాట వాస్తవమే. ఈ పశువైద్య ఉప కేంద్రాన్ని ప్రాథమిక పశువైద్యశాలగా అప్‌గ్రేడ్ చేసి రెగ్యులర్ డాక్టర్‌ను నియమించి సిబ్బందిని పెంచాల్సిన అవసరం ఉంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

– వీరారెడ్డి, పశువైద్యాధికారి, చిలుకూరు